క్లుప్తంగా

19 నుంచి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ

చింతపల్లి: చింతపల్లిలో ముత్యాలమ్మతల్లి జాతరను పురస్కరించుకొని ఈ నెల 19 నుంచి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. టోర్నీలో సింగిల్, డబుల్ గేమ్స్‌లో ఆడే క్రీడాకారులు తమ పేర్లను గురువారం నుంచి నమోదు చేసుకోవాలన్నారు. చింతపల్లి ముత్యాలమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో జరిగే ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులు ఈనెల 19 వ తేదీ సాయంత్రంలోగా రూ.500 ప్రవేశ రుసుము చెల్లించి పేర్లు నమోదు చేసుకువచ్చన్నారు. అదే రోజు సాయంత్రం నమోదు చేసుకున్న జట్లకు డ్రా తీయనున్నట్టు పేర్కొన్నారు. 19, 20వ తేదీల్లో సాయంత్రం 5 గంటల నుంచి ఈ టోర్నమెంట్ ప్రారంభమవుతుందన్నారు.మావీష్ 350 షటిల్‌తో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు. ఈ టోర్నీలో విజేతలకు మొదటి బహుమతిగా రూ.25వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు అందించనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 9491258204, 8500567056, 9491333543 నంబర్లకు సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

నీటితొట్టెల పనుల పరిశీలన



చేనుపాకలులో నీటితొట్టెల పనులను పరిశీలిస్తున్న ఏపీడీ రాంబాబు తదితరులు

అడ్డతీగల: గ్రామాల్లో పశువుల దాహార్తి తీర్చడానికి నిర్మిస్తున్న నీటి తొట్టెలను సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలని ఉపాధి హామీ పథకం అడ్డతీగల క్లస్టర్ ఏపీడీ ఎల్.రాంబాబు ఆదేశించారు. మండలంలోని లోతావారివీధి, బొడ్లంక, చేనుపాకలు గ్రామాల్లో నిర్మిస్తున్న నీటి తొట్టెల పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్యం మేరకు ప్రతిపాదనలను అనుసరించి ఉన్నతాధికారుల ఆమోదం తెలిపిన పనులను వేగవంతంగా చేపట్టాలన్నారు. పనులకు సంబంధించి పలు సూచనలు చేశారు.

పాడి రైతుకు నష్టపరిహారం చెల్లించాలి

డుంబ్రిగుడ: పెద్దపాడులో మంగళవారం పిడుగుపాటుకు గురై పశువులు మృతి చెందిన బాధిత రైతుకు నష్టపరిహారం చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోతంగి పంచాయతీ పెద్దపాడు గ్రామానికి చెందిన కొర్ర మారుతిరావుకు చెందిన దుక్కి పశువులు మంగళవారం కురిసిన భారీ వర్షం, మెరుపు, ఉరుములతో పిడుగుపాటుకు పశువుశాలలో ఉన్న నాలుగు దుక్కి పశువులు మృత్యువాత పడ్డాయన్నారు. ప్రకృతి వైపల్యంతో పిడుగుపాటుకు చనిపోయిన పశువులకు ప్రభుత్వం, అధికారులు బాధిత రైతుకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన కోరారు.

18న విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరు రూరల్: పాడేరు డివిజనల్ పరిధిలోని వివిధ మండలాల్లో విద్యుత్ మరమ్మతు పనుల నేపథ్యంలో ఈనెల 18న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.వి.ఎస్.ఎం.అప్పారావు బుధవారం ఓక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జి.మాడుగుల మండల సబ్‌స్టేషన్ పరిధిలోని జి.మాడుగుల, పాత జి.మాడుగుల, కొత్తూరు, పాడేరు మండలంలోని టౌన్‌షిప్‌తో పాటు కలెక్టర్ బంగ్లా, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, పరిసరాల ప్రాంతాలు, కొయ్యూరు మండల పరిధిలో కె.డి.పేట, నాగపురం, కొత్తబంగరంపేట, పరదేశీపాకలు, గుమ్మలపాలెం, రాజుపేట, బలుసుకూరపాకలు తదితర గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వాహనాల తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ నరసింహమూర్తి, ఎస్‌ఐ వినోద్ తదితరులు

అడ్డతీగల: మండలంలోని వేటమామిడి వద్ద అడ్డతీగల సీఐ నరసింహమూర్తి, ఎస్‌ఐ వినోద్ ఆధ్వర్యంలో బుధవారం విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. జాతీయ రహదారిపై అడ్డతీగల, వై.రామవరం, నర్సీపట్నం వైపు రాకపోకలు సాగించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహన రికార్డులను పరిశీలించారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. రహదారి భద్రతపై అవగాహనతో ఉండాలన్నారు. వాహన రికార్డులు తప్పనిసరి అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదన్నారు. నూతన ట్రాఫిక్ చట్టాల ప్రకారం భారీ జరిమానాలు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

జీడి రైతు దిగాలు



అమ్మకానికి సిద్ధం చేసిన జీడిపిక్కలు



జీడిమామిడి పూత

రాజవొమ్మంగి: ఈ ఏడాది జీడిమామిడి రైతు దిగుబడి లేక డీలా పడ్డాడు. పంటను గిరిజనుల నుంచి కొనుగోలు చేస్తామని ప్రభుత్వం సీజన్ మొదట్లో అట్టహాసంగా ప్రకటించి, చివరిలో చేతులెత్తేసింది. వన్‌ధన్ కేంద్రాల ద్వారా జీడిపిక్కలు కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇచ్చిన రంపచోడవరం ఐటీడీఏ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎటువంటి కొనుగోలు చేయలేదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మండల కేంద్రాల్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు తెరుచుకోకపోవడంతో రైతులు దళారులకు పంటను విక్రయిస్తున్నారు. ప్రయివేటు వ్యాపారులు కొనుగోలు చేస్తున్న ధరలో స్పష్టత లేక తమ పంటను ఎవరికి అమ్ముకోవాలో తెలియని అయోమయ పరిస్థితులను రైతులు ఎదుర్కొంటున్నారు.

విస్తారంగా సాగు



దెబ్బతిన్న జీడిమామిడి పూత

రాజవొమ్మంగి, కొయ్యూరు పరిసరాల్లో దాదాపు 10వేల ఎకరాల్లో జీడిమామిడి పంట సాగవుతోంది. ఈ రెండు మండలాల్లో పండిన పంటకు రాజవొమ్మంగి ప్రధాన మార్కెట్ కేంద్రంగా ఉంది. కాగా వాతావరణ ప్రభావం, పూత పిందె దశలో దట్టంగా మంచు కురువడంతో పూత మాడిపోయి దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. ఎకరాకు సరాసరిన 5 బస్తాల దిగుబడి రావాల్సిన పంట ప్రస్తుతం రెండు బస్తాలు కూడా రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దుక్కులకు, ఎరువులకు పెట్టిన పెట్టుబడి కూడా చేతికి వచ్చేలా లేదని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా కొనుగోలు కేంద్రాలు తెరిస్తే చేతికి వచ్చిన పంటకు అయినా గిట్టుబాటు ధర లభిస్తుందన్న ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతి మండలంలో ఒక కొనుగోలు కేంద్రం తెరవాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా జీడిమామిడి పిక్కల ధర రాజవొమ్మంగిలో మొదట్లో బస్తా (80 కిలోలు) ధర రూ.12వేలు పలికింది. అయితే నెమ్మదిగా రూ.11, 500, 11,200, 11వేలకు దిగజారింది. కాగా ప్రస్తుతం ఈ ధర రూ.12, 500 కు పెరిగిందని మార్కెట్టు వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వం వన్‌ధన్ కేంద్రాల ద్వారా కొనుగోలు చేయకపోవడంతో పాటు ధరలు నిలకడగా లేకపోవడంతో రైతులు గత్యంతర లేక ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారులంతా సిండికేట్‌గా మారి నిర్ణయించిన తక్కువ ధరలకే రైతులు విక్రయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో పంట పెట్టుబడి సొమ్ము రాక గిట్టుబాటు లేక చేసిన అప్పులు తీర్చుకోలేక రైతులు సతమతమవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జీడిపిక్కలను కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు తెరవాలి



గతంలో ప్రకటించిన మేరకు ప్రభుత్వం ఏజెన్సీలో విస్తారంగా సాగవుతున్న జీడిమామిడి పంటను ఐటీడీఏల ద్వారా కొనుగోలు చేయాలి. ప్రతి మండలంలో ఒక కొనుగోలు కేంద్రం తెరిస్తే జీడిమామిడి రైతు నష్టాల నుంచి బయటపడే అవకాశం ఉంది. జీడి పిక్కల ధరను ఎప్పటికప్పుడు ప్రకటిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

– లోతా రామారావు, గిరిజన సంఘం నాయకుడు

జీడిపిక్కల కొనుగోలు



రంపచోడవరంలోని పందిరిమామిడి కేంద్రంగా జీడిమామిడి పిక్కలు కొనుగోలు జరుగుతుంది. ఇప్పటివరకు 60 శాతం కొనుగోలు జరిగింది. మిగిలిన మండలాల్లోనూ వన్‌ధన్ వికాస్ కేంద్రాల ద్వారా కొనుగోలుకు చర్యలు తీసుకుంటాం. ప్రతి మండలంలో రెండు వీడీవీకేల ద్వారా కొనుగోలు చేస్తాం.

– ఎస్.దేగలయ్య, ఏపీడీ, రంపచోడవరం

అధికారుల నిర్లక్ష్యంతో కూలీలకు ఇబ్బందులు



కూలీలతో మాట్లాడుతున్న సాయన్న

ఎటపాక: అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉపాధి కూలీలకు సరైన వేతనం, సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథ అనుబంధ సంఘం అఖిల భారత ప్రగతి శీల వ్యసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి సాయన్న అన్నారు. మండలంలోని టొజ్జిగుప్ప గ్రామంలో ఉపాధి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. అక్కడి కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 వారాలు ఉపాధి పనులు చేసినా కూలీలకు వేతనాలు ఇవ్వలేదన్నారు. పని ప్రదేశంలో సరైన సౌకర్యాలు లేవని అధికారుల నిర్లక్ష్యం కారణంగా కూలీలకు ప్రభుత్వ నిబంధన ప్రకారం వేతనాలు అందడంలేదన్నారు. కూలీలకు రోజు కూలీ రూ.600 ఇవ్వాలని, వేతనాలు వారం రోజులకే అందజేయాలని డిమాండ్ చేశారు. నాయకులు వెంకటేశ్వర్లు , మురళీ, శ్రీను, రాజమ్మ, రాములమ్మ, మహాలక్ష్మి, తిరుపతమ్మ తదితరులున్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, చిత్రంలో సీడీపీవో రమణ

చింతపల్లి: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవడంతో ఆరోగ్యవంతంగా ఉండే అవకాశం ఉంటుందని సీడీపీవో జి.వి.రమణ అన్నారు. పెదబరడ పంచాయతీ రాజుపాకలు సెక్టార్‌లో గల లోతుగెడ్డ జంక్షన్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే ఆరోగ్యం కలుగుతుందన్నారు. గర్భిణులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రోజూ వారీ ఆహారంలో పోషక విలువలున్న ఆకుకూరలు వంటివి తీసుకోవాలని సూచించారు. ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్లు విజయకుమారి, గౌహర్‌ఉన్నీష, గౌరి, అప్పలనర్సమ్మ అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య పరీక్షలో సత్తాచాటిన దారపల్లి విద్యార్థులు



ఏకలవ్య ప్రవేశ పరీక్షలో సత్తాచాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ముంచంగిపుట్టు: మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ దారపల్లి ఎంపీపీ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్ 6వ తరగతి ప్రవేశ పరీక్షలో సత్తాచాటారు. పాఠశాల నుంచి 5వ తరగతికి చెందిన 8 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షలు రాస్తే ఏడుగురు విద్యార్థులు అర్హత సాధించారు. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వంతాల అంబిక, సీసా వైష్ణవి, కొర్ర దేవి, కొర్ర చాందిని, జొర్లోయి జయవర్ధన్, మట్టం ఆదిత్య వర్ధన్ పడాల్, పడనైకి దేవేంద్రహరిప్రసాద్‌లు ఎంపికయ్యారు. ఆయా విద్యార్థులతో పాటు వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు వెచ్చంగి హరిష్‌చంద్ర, శెట్టి అనంతరావు, రెయ్యల రమాప్రభలను కించాయిపుట్టు సర్పంచ్ సుభాష్ చంద్ర, ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ, దారపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయుల ఉత్తమ బోధన వల్లనే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించగలిగామని విద్యార్థులు తెలిపారు.

172 మంది దివ్యాంగులకు ఉపకరణాలు



దివ్యాంగుల వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ, ఏఎల్ఐఎంసీవో సంస్థలు సంయుక్తంగా దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముంచంగిపుట్టు, పెదబయలు మండలాలకు చెందిన దివ్యాంగులు హాజరయ్యారు. వారి ఆధార్, రేషన్‌కార్డు ఇతరత్రా ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి, పంపిణీ చేయాల్సిన ఉపకరణాల వివరాలను నమోదు చేసుకున్నారు.ఈ శిబిరాన్ని ముంచంగిపుట్టు, పెదబయలు ఎంపీడీవోలు సూర్యనారాయణమూర్తి, పూర్ణయ్యలు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ విశాఖ జిల్లా సీడీసీవో వి.మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఈ శిబిరంలో 172 దివ్యాంగులను గుర్తించామని, వారికి త్వరలో ఉపకరణాలు అందించనున్నట్టు తెలిపారు. సంస్థ ప్రతినిధులు అప్పలనాయుడు, ప్రకాశ్, పంచాయతీ కార్యదర్శులు, వైద్యులు, అధిక సంఖ్యలో దివ్యాంగులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



ఉపాధ్యాయుడు రవీంద్రను సన్మానిస్తున్న మాజీ మంత్రి బాలరాజు, సహచర ఉపాధ్యాయులు

చింతపల్లి: సీనియర్ ఉపాధ్యాయుడు వాడకాని రవీంద్ర గిరిజన విద్యాభివృద్ధికి అందించిన సేవలు అభినందనీయమని మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు అన్నారు. ఈ నెల 31న పదవీ విరమణ పొందుతున్న రవీంద్రకు బుధవారం లంబసింగి బాలుర ఆశ్రమ పాఠశాలలో సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రవీంద్ర, అన్నామణి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి బాలరాజు మాట్లాడుతూ మన్య ప్రాంతంలో అనేక పాఠశాలల్లో విధులు నిర్వహించి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఉపాధ్యాయునిగా 39 ఏళ్ల పాటు విధులు నిర్వహించి, ఎటువంటి రిమార్కులు లేకుండా అధికారులు మన్ననలు అందుకున్నారన్నారు. పుట్టిపెరిగి, చదువుకున్న స్వగ్రామంలో పదవీ విరమణ పొందడం చాలా అరుదని అటువంటి ఘనత రవీంద్రకు దక్కిందన్నారు. ఎంఈవోలు-1, 2 పనసల ప్రసాద్, బోడం నాయుడు, హెచ్‌ఎంలు వీరభద్రరావు, నర్సింగరావు, నారాయణరావు, సీనియర్ ఉపాధ్యాయులు రాజు, శ్రీనివాసరావు, జీసీసీ మేనేజర్ విజయకుమార్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల మరమ్మతులకు చర్యలు

కొయ్యూరు: మండలంలో 19 పాఠశాలల్లో మరమ్మతు పనులకు సమగ్ర శిక్ష అభియాన్ నిధులు మంజూరైనట్టు ఎంఈవో రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నూకరయితోట, కిండంగి, బూదరాళ్ల, ఆర్.నిమ్మలపాలెం, బి.కొత్తూరు, పెదమాకవరం, తోటలూరు, బట్టపనుకుల, గన్నెర్లపాలెం, వెలగలపాలెం, బొడ్డుమామిడి, పాలమామిడి, రెల్లలపాలెం, రొబ్బసింగి, ధర్మవరం, మల్లవరం, రామన్నపాలెం పాఠశాలలకు రూ.13.05 లక్షల నిధులు కేటాయించనున్నట్టు పేర్కొన్నారు. మరికొన్ని గ్రామాల్లో పాఠశాలలు పాడయ్యాయని, వాటి మరమ్మతుకు నిధుల కోసం ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. ప్రస్తుతం మంజూరైన నిధులతో ఉన్నతాధికారుల ఆదేశానుసారం పాఠశాలల్లో మరమ్మతు పనులకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహావిష్కరణ

మాకవరపాలెం : మండలంలో చామంతిపురం పంచాయతీ శివారు వెంకటాపురంలో ఏర్పాటు చేసిన అంజనేయస్వామి విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ బుధవారం ఆవిష్కరించారు. నర్సీపట్నం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వికాస్ సతీష్, ఇందిరా దంపతులు ఏర్పాటు చేసిన హనుమాన్ విగ్రహా ఆవిష్కరణ మహోత్సవానికి మాజీ ఎమ్మెలే హాజరయ్యారు. యర్రాపాత్రుడు, సత్యనారాయణ, సర్పంచ్ గోవిందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ తప్పనిసరి



కిలగాడలో దోమల మందు పిచికారీని పర్యవేక్షిస్తున్న వైద్యాధికారి రమేష్



బొంగరంలో పనులు పర్యవేక్షిస్తున్న వైద్యాధికారి చైతన్య తదితరులు



గోపవరంలో దోమల మందు పిచికారీని పర్యవేక్షణ చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీలు



డి.పోలవరప్పాడులోని ఇంట్లోని దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది



ఎటపాకలో గ్రామస్తులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ పుల్లయ్య

ముంచంగిపుట్టు: జిల్లా వ్యాప్తంగా దోమల నివారణ మందు పిచికారీ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టారు. ఈ మేరకు గ్రామాల్లో వైద్యాధికారులు పర్యటించి మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంటింటా దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, వైద్య ఆరోగ్య శాఖాధికారులు తదితరులు మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల వల్ల మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు ప్రబలే అవకాశముందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి బయట, లోపల తప్పనిసరిగా దోమల నివారణ మందు పిచికారీ చేయించుకోవాలని, దోమ తెరలు వినియోగించాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధుల నివారణకు అందరూ సహకరించాలన్నారు. జ్వరం వస్తే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి తగిన పరీక్షలు చేయించుకుని మందులు వేసుకోవాలని సూచించారు. ముంచంగిపుట్టు మండలంలోని కిలగాడలో జరిగిన కార్యక్రమంలో కిలగాడ వైద్యాధికారి రమేష్ , సర్పంచ్ శివశంకర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చౌడప్పడు, మండల మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేశ్వరరావు, ఎంపీహెచ్ ఈవో సుబ్రహ్మణ్యం, సీహెచ్‌డబ్ల్యూ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలోని బొంగరం, పెదకోడాపల్లిలో జరిగిన పిచికారీ పనులను గోమంగి, పెదబయలు పీహెచ్‌సీల వైద్యాధికారులు చైతన్య, నిఖిల్, మలేరియా సబ్ యూనిట్ అధికారి పురుషోత్తంరాజు, ఎంపీహెచ్‌ఈవో వెంకటరావు, సర్పంచ్ చిట్టిబాబు పర్యవేక్షించారు. ఏఎన్ఎం చంద్రకళ, వైద్య సిబ్బంది.స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రంపచోడవరం: మండలంలో తామరపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ ఆనంద్‌రెడ్డి, ముసురుమిల్లి ఎంపీటీసీ వంశీ కుంజం మాట్లాడుతూ గ్రామస్తులకు దోమతెరలు పంపిణీ చేయాలన్నారు. మాజీ సర్పంచ్ బాపిరాజు, పీసా కమిటీ కార్యదర్శి రవి, ఏఎంఓ రాజు, సీహెచ్‌వో అన్నపూర్ణ, ఎస్‌యూవో సత్యనారాయణ, సతీష తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండలంలోని డి.పోలవరప్పాడులో పిచికారీ పనులను దుప్పలపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి స్పందన, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ అశోక్‌కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

ఎటపాక: బుట్టాయిగూడెంలో జరిగిన దోమల నివారణ మందు పిచికారీ పనులను డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, డాక్టర్ విష్ణుప్రియ పర్యవేక్షించారు. సూపర్‌వైజర్ సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని లోతట్టు గ్రామం పూదూడిలో జరిగిన పిచికారీ పనులను సర్పంచ్ రామారావు తదితరులు పర్యవేక్షించారు.

యూటీఎఫ్ నేతల వినతి



కంద్రుమ్ సర్పంచ్ హరికి వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ అధ్యక్షుడు బాలకృష్ణ



సర్పంచ్ జయకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

డుంబ్రిగుడ: ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు వల్ల విద్యారంగానికి తీరని నష్టం జరుగుతుందని, దీన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని పలు ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. ఇందులో భాగంగా పంచాయతీలో విద్యార్థుల సంఖ్య 60కు మించి ఉంటే మోడల్ పాఠశాల ఏర్పాటుచేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, అయితే ఏజెన్సీలో 45 మంది విద్యార్థులు ఉన్న చోట మోడల్ స్కూల్‌ను ఏర్పాటుచేయాలని కోరుతూ యూటీఎఫ్ అధ్యక్షుడు బాలకృష్ణ తదితరులు కంద్రుమ్ సర్పంచ్ హరికి వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు ధనుర్జయ్, నిరంజన్, తులసిదాస్ తదితరులు పాల్గొన్నారు.

వి.ఆర్.పురం: ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో విద్యారంగాన్ని తీరన అన్యాయం జరుగుతుందని యూటీఎఫ్ నాయకులు చెప్పారు. ఈ మేరకు ఏజెన్సీలో యూటీఎఫ్ నాయకులు జగదీష్, ప్రసాద్, వీరయ్య తదితరులు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో 60 కు మించి విద్యార్థులు ఉంటే ప్రైమరీ స్కూల్‌గా ఏర్పాటుకు ప్రభుత్వం ప్రకటించిందని, అయితే నిబంధనను సడలించి, ఏజెన్సీలో ప్రతి గ్రామంలో విద్యార్థుల సంఖ్యతో లేకుండా మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేయలని కోరుతూ సర్పంచ్ జయకు వినతిపత్రం అందజేశారు.

గ్యాస్ సిలిండర్ ప్రమాదాలపై అవగాహన

మాడుగుల : జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 3వ రోజు బుధవారం మాడుగులలో అపార్టుమెంట్లలో నివాసముంటున్న మహిళలకు గ్యాస్, ఎలక్ట్రికల్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రతలతో పాటు ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రతలపై అగ్నిమాపక సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో ఫైర్ అధికారి వి. రాజేశ్వరరావు, సిబ్బంది భోగేశ్వరరావు, వర్మ, మూర్తి, వరహాలరావు పాల్గొన్నారు.

సచివాలయం, పాఠశాలల్లో తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిరీష

రాజవొమ్మంగి: అమీనాబాద్ సచివాలయాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. మండలంలోని పలు సచివాలయాలకు వెళ్లి సిబ్బంది పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అమీనాబాద్ లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలకు వెళ్లి మెనూ అమలుతీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.